## 21. వేదం వెంకటరాయ శాస్త్రి

ఆంధ్రులకు చిరస్మరణీయులైన శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి శ్రీ వెంకట రమణ శాస్త్రి, శ్రీమతి లక్ష్మమ్మ దంపతులకు మద్రాసులో 21 .12. 1853 లో జన్మించారు వేదం వారు తన పదహారవ యేట మెట్రిక్యులేషన్ మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వీరు ఉత్తమ నాటక కర్త గా, పండితులుగా, అలంకారికులుగా పేరు పొందారు. వీరు అనేక గ్రంధాలను వ్రాశారు.

శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి గారు 1916 లో సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రధాన సంపాదకులుగా పనిచేశారు. రసమంజరి ,సాహిత్య దర్పణం, కథాసరిత్సాగరం మొదలైనవి వేదం వారి సుప్రసిద్ధ రచనలు. వీరు బహుభాషా కోవిదులు. సంస్కృతం, ఆంధ్రం ,ఆంగ్లం,అర్ధం, కన్నడం, హిందీ భాషల్లో చక్కని పాండిత్యం కలవారు. తర్కం, వ్యాకరణం, వేదాంత శాస్త్రాలలో పారంగతులు. రచయితగా, వక్తగా, అధ్యాపకులుగా, నాటక కళా చార్యులు గా ఎంతో ఖ్యాతిని పొందారు. శాస్త్రిగారు మొత్తం పది రూపకాలను రాశారు .

వేదం వారి నాటకాలలో ప్రతాపరుద్రీయం ఎంతో ప్రసిద్ధి పొందింది. ఈ నాటకం వేదం వారికి ఎంతో కీర్తి తెచ్చిపెట్టింది. ఇటువంటి అద్భుత నాటకం ఇంతవరకు తెలుగులో వెలువడలేదని ప్రముఖులు ప్రశంసించారు. ప్రతాపరుద్రీయమే తొలి చారిత్రక నాటకంగా చెప్పవచ్చు. వీరు ఆధునిక వచన రచనలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. భాష విషయంలో శ్రద్ధ చూపుతారు. 1896లో అభిజ్ఞానశాకుంతలాన్ని అనువాదం చేసారు. అందులో భాషా వైవిధ్యాన్ని పాటించారు.

1920లో ఆంధ్ర మహాసభ, మహోపాధ్యాయ బిరుదుతో సత్కరించింది. 1902లో సర్వతంత్ర, స్వతంత్ర ,మహోపాధ్యాయ విద్యాదాన వ్రత మహోదధి గౌరవాలతో సత్కారం పొందారు. 1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ 'కళాప్రపూర్ణ' బిరుదుతో గౌరవించింది

**ప్రతాపరుద్రీయం:** ఈ నాటకంలో ప లి అంకాలు ఉన్నాయి. ఈ కథలో ప్రతాపరుద్రుడిని మహమ్మదీయ సైన్యాలు ఓడించి బంధిస్తాయి. దీన్ని ఆధారంగా చేసుకొని తన ప్రతిభతో శాస్త్రిగారు

చక్కటి వివరణ చేశారు . నాటకంలోని నీచ పాత్రలకు గ్రామ్య భాష వాడారు. ప్రతాపరుద్రీయం నాటకంలో మంత్రి యుగంధరుడు. ప్రతాపరుద్రుడిని మహమ్మదీయులు బంధించినప్పుడు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించి, బుద్ధిబలంతో ఆయనను విడిపించిన ధీశాలి. తెలుగు మహామంత్రిగా చరిత్రలో నిలిచిపోయేటట్లు శాస్త్రి గారు యుగంధరుడి పాత్రను తీర్చిదిద్దారు.

తెలుగు వారు గర్వించే విధంగా ప్రతాపరుద్రీయం నాటకాన్ని రూపొందించి, ఖ్యాతి పొందిన శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రి గారు చిరస్మరణీయులు.